క్లుప్తంగా

వంతెనలు నిర్మించాలి



ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని ఇస్వీ చెరువు నుంచి గణేకల్ గ్రామం వరకు ఉన్న రహదారిలో మూడు చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని సీపీఎం నాయకులు ఎంపీడీఓ గీతావాణికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలో సుమారు 300 ఎకరాలకు సంబంధించి వంద మంది దాకా రైతులు పొలాలకు వెళతుంటారన్నారు. ఎరువులు తరలించడానికి, ఇతర పనుల నిమిత్తం, పంట చేతికొచ్చినప్పుడు ధాన్యాన్ని ఇంటికి తీసుకురావడానికి తీవ్రమైన అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రైతులు అరికాలప్ప, గొల్ల చంద్ర, సాబ్, వెంకటేష్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

కౌతాళం: మండల కేంద్రానికి తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంకులో నీరు అడుగంటి పోయాయని, ట్యాంకు నుంచి ఇతర గ్రామాలకు నీటి సరఫరాను బంద్ చేయాలని సీపీఎం నాయకుడు మల్లయ్య కోరారు. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్యాంకులో కేవలం 10 నుంచి 15 రోజులకు సరిపడా నీరు మాత్రమే ఉందని, ఈ నీటిని కౌతాళంకు మాత్రమే సరఫరా చేయాలని కోరారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి ట్రాక్టర్లలో ట్యాంకుల ద్వారా తోవి, కుంటనహాల్, ఉప్పరహాల్, రౌడూరు, ఎరిగేరి గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారని, దీంతో వారం రోజుల్లోనే నీరు అయిపోతుందన్నారు. ఉన్న నీటిని కౌతాళంకు మాత్రమే అందించి, ఇతర గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. నాయకులు సత్యప్ప, ఈరన్న, ఉలిగయ్య, ఆదిశేషు, భీమయ్య, వలి ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయండి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ శివారులో ఉన్న కంబళితాత దర్గా వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం నాయకులు ఈరన్న, వులిగయ్య, శంకర్, మహబూబ్‌బాష డిమాండ్ చేశారు. మంగళవారం బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. గతేడాది అధిక వర్షాల వల్ల బ్రిడ్జి కూలిపోవడంతో నిర్మాణం ప్రారంభించారని ఇంకా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రిడ్జి నిర్మాణం దాదాపు 70 శాతం పూర్తయ్యిందని కాంక్రీట్ ఫ్లోరింగ్ వేయాలని కోరారు. ప్రస్తుతం బ్రిడ్జిపై తాత్కాలికంగా గ్రావెల్ వేస్తే బస్సులు తిరుగుతాయని, రైతులు పొలాలకు వెళ్లేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అధికారులు గ్రహించి తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి వాహిద్‌కు వినతిపత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివారెడ్డి

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఆళ్లగడ్డలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.శివారెడ్డిని ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. ఇప్పటివరకు ఎమ్మిగనూరు లక్ష్మమ్మవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. మంగళవారం మహబూబ్ బాషా నుంచి రెగ్యులర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూర్ కళాశాల సూపరింటెండెంట్ మద్దిలేటి, అధ్యాపకులు న్యూటన్‌రాజు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

మంత్రాలయం రూరల్: మండలంలో కాచాపురం, కగ్గల్లు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి పేర్కొన్నారు. రెండు గ్రామాల్లో తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ బృందం, ఎంపీడీఓ బృందం పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

మంత్రాలయం రూరల్: నియోజకవర్గంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు సంబంధించి నాడు-నేడు పనులపై సీడీపీఓ నాగమణి మంత్రాలయంలోని కార్యాలయంలో నాలుగు మండలాల సూపర్‌వైజర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కేటాయించిన భవనాలకు కావాల్సిన స్థలాల సేకరణ, నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి, వాటి స్థితిగతులపై వివరాలు సేకరించారు. త్వరలోనే జిల్లా కలెక్టర్ సమావేశంలో పూర్తి నివేదికతో పాల్గొననున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే సురక్ష ధ్యేయం





ఆదోనిలో సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు, అగసనూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ఆదోనిటౌన్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు సినిమా నటుడిగానే చూస్తున్నారని, సినిమాల్లో మాదిరిగా ప్రజల మధ్య నటిస్తే ఇంటికి పంపుతారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఉనికిని కాపాడుకునేందుకు కోసం పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే తరిమికొడతారని హెచ్చరించారు. మంగళవారం ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 4, 28, 29, 30, 31 వార్డులకు సంబంధించి వీరశైవ కళ్యాణ మండపంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయశాంత, కౌన్సిలర్లు బాలాజీయాదవ్, మహ్మద్ స్వామి, మహేశ్వరి, నాగరత్నమ్మ, పద్మ, బి.కె.లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు సంబంధించి 3,046 కులం, ఆదాయం, రేషన్‌కార్డు విభజన, కుటుంబ విభజన, ఆధార్‌కార్డు అనుసంధానం తదితర సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల్లో ఉనికి కోసమే పవన్‌కళ్యాణ్ ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దమ్ముంటే 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి గెలవాలే తప్పా ఎవరికోసమో ఊడిగం చేయడం ఎందుకని ప్రశ్నించారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చని మాజీ సీఎం చంద్రబాబునాయుడిని ఎందుకు నిలదీయలేదని, ఇచ్చిన హామీల కంటే అదనంగా పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై బురదజల్లే పని ఎందుకు పెట్టుకున్నారో ప్రజలకు తెలుసన్నారు. రాజకీయంగా వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేకే ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

కోసిగి: సంక్షేమ పథకాలకు అర్హులైన వంద శాతం మందికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అగసనూరు గ్రామంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సజ్జలగుడ్డం గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అగసనూరులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తోందన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకుని ఉచితంగా సచివాలయంలో సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. అనంతరం దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ వడ్డె ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, మంత్రాలయం మండల కన్వీనర్ భీంరెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు సభ్యులు మల్లికార్జున గౌడ, ఎంకే నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన భేష్



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుంది. అన్ని వర్గాల ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి పథకాలను అందిస్తున్నారు. నవరత్నాల్లో భాగంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకే వచ్చి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఇంతకన్నా మంచి ప్రభుత్వం ఏదీలేదు. జగనన్నను మళ్లీ గెలిపించుకుని మరిన్ని పథకాలను అందుకుంటాం. **– సరస్వతి, గణేష్‌సర్కిల్, ఆదోని**

ఉచితంగా సర్టిఫికెట్లు ఇచ్చారు



గతంలో కులం, ఆదాయం, కుటుంబ విభజన సర్టిఫికెట్లు కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ, అప్పటి నాయకుల చుట్టూ రోజుల తరబడి తిరిగేవాళ్లం. అయినా పట్టించుకునే వారు కాదు. జగనన్న పాలనలో ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులను స్వీకరించి ఉచితంగా సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్నారు. వ్యయప్రయాసలు తప్పాయి.

– ఈరమ్మ, శక్తి గుడి, ఆదోని

సురక్షతో సత్వర సేవలు



ఇస్వీ గ్రామంలో సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీడీఓ గీతావాణి, అధికారులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామంలో ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో సర్పంచ్ శ్యామల అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వెయ్యి మంది లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అందించారు. డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ మాణిక్యమ్మ, పంచాయతీ సెక్రటరీ చంద్రకళ పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలోని కుంటనహాల్ గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి బృందం, పొదలకుంటలో ఎంపీడీఓ సుబ్బరాజు బృందం ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రజలు అందించిన దరఖాస్తులను అక్కడిక్కడే పరిశీలించి ధ్రువపత్రాలను ఎంపీపీ అమరేష్ చేతులమీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్ పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామంలో సర్పంచ్ తిమ్మక్క ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్ని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 385 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ అమరేష్

ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, స్త్రీలు, చిన్నపిల్లల ఆస్పత్రులను జిల్లాస్థాయిలో అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశులు అధికారులను కోరారు. ఈనెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు జరిగే మహాపాదయాత్ర జయప్రదం చేయాలని ఆదోని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్వన్‌పేట, కౌడల్‌పేట, కునిమొల్ల, అరుణ్‌జ్యోతినగర్ ఏరియాల్లో పాదయాత్ర ప్రచారం నిర్వహిస్తూ మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కాలనీవాసులతో మాట్లాడారు. ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్ల పరిధిలో వందలాది గ్రామాల ప్రజలు ఆదోని పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రులు కీలకమైనవన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని నియమించి, సిటీ స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి వైద్య సేవలు విస్తృతం చేయాలన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యవర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత



నగదును అందజేస్తున్న గ్రామ సర్పంచ్ హనుమంతమ్మ

కోసిగి: మండల పరిధిలోని నేలకోసిగి గ్రామానికి చెందిన దుబ్బారి ఈరన్న మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేసింది. మంగళవారం గ్రామ సర్పంచ్ హనుమంతమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ అన్నపూర్ణ చేతుల మీదుగా మృతుడి భార్య రామలింగమ్మకు నగదును అందజేశారు. మిగతా రూ.90 వేలు త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతాయని వారు తెలిపారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం



హెచ్.మురవణి గ్రామంలో గురువులను సన్మానించిన విద్యార్థులు

పెద్దకడబూరు: మండలంలో పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళుతున్న అధికారులను గ్రామస్తులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామం ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న బాలబంధు, కవి గద్వాల సోమన్న, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అంజనేయులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఎస్ఐ శ్రీనివాసులను సీఐ ఎరిష వలి ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సన్మానించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దకడబూరు ఎస్ఐ శ్రీనివాసులును సన్మానించిన సీఐ ఎరిష వలి

ఆపదలో ఆదుకున్నారు

పెద్దకడబూరు: ఈ ఫొటోలో ఆస్పత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న వృద్ధురాలు పెద్దకడబూరుకు చెందిన ఉసేనమ్మ. ఈమెకు 2022 నవంబర్‌లో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో 15 రోజుల పాటు ఉండాల్సి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆమెకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఏమి చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్న ఆమె ఎదుట వలంటీర్ నయోమి ప్రత్యక్షమైంది. ఆమెను చూడగానే ఉసేనమ్మ ప్రాణం లేచివచ్చినట్లు అయ్యింది. పింఛన్ డబ్బులు ఇస్తుంటే ఉసేనమ్మ కళ్ల వెంట కన్నీటి బాష్పాలు రాలాయి. ఆపదలో ఉన్నవారికి అండగా ఉండాలని సీఎం జగనన్న మమ్మల్ని నియమించారు. ఆయన ఆశయం మేరకు కృషిచేస్తున్నాం అని వలంటీర్ చెప్పగా.. ఆస్పత్రి వద్దకే వచ్చి పింఛన్ అందించేలా గొప్ప వ్యవస్థ ప్రవేశపెట్టిన సీఎం జగనన్న చల్లగా ఉండాలని దీవించింది.



కర్నూల్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉసేనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నయోమి

మాలాంటి వాళ్ల దీవెనలు ఉంటాయి



సీఎం జగన్ మా కన్నకొడుకు లాగా బాగోగులు చూసుకుంటున్నారు. మేము ఎక్కడ ఎలాంటి పరిస్థితిలో ఉన్నా అక్కడికే పింఛన్ సొమ్ము పంపుతూ ఇబ్బందులు తీరుస్తున్నాడు. ఇలాంటి వారు పది కాలాల పాటు బాగుండాలని దేవుడిని కోరుకుంటున్నా. వలంటీర్ రూపంలో సహాయం చేయించిన ముఖ్యమంత్రిని ఎన్నటికీ మర్చిపోలేను. జగన్ ఎక్కడున్నా మాలాంటి వాళ్ల దీవెనలు ఉంటాయి. **– ఉసేనమ్మ, పెద్దకడబూరు**

బడిబయటి బాలలను గుర్తించండి



మాట్లాడుతున్న మండల విద్యాధికారి-2 రాఘన్న

మంత్రాలయం రూరల్: మండలంలో బడిబయట ఉన్న బాలలను గుర్తించాలని మండల విద్యాధికారి-2 రాఘన్న ఆదేశించారు. ఎంపీడీఓ మణిమంజరి ఆధ్వర్యంలో బడిబయట పిల్లల వివరాల సేకరణ, గుర్తింపుపై మండలంలోని సోషల్ వెల్ఫేర్, సీఆర్‌పీ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల కార్మికులు ఉండరాదని, అలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఈఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వేణు, సీఆర్‌పీలు భీమేష్, బంగారప్ప తదితరులు ఉన్నారు.

జీడీపీ పనులు పూర్తిచేయండి



రాంజల చెరువు వద్ద పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అధికారులు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి జీడీపీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆనకట్ట ఎత్తు పెంచే పనులు, క్రస్ట్ గేట్ల మరమ్మతు పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. జీడీపీ ఆనకట్ట ఎత్తు పెంపునకు ప్రభుత్వం రూ.57.3 కోట్లు మంజూరు చేసిందని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆనకట్ట ఎత్తు పెరిగితే భూమి అవసరం ఉంటుందని జీడీపీ ఎగువ ప్రాంతంలో భూసేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. జీడీపీ పనులు పూర్తయితే మరో టీఎంసీల నీరు అదనంగా నిల్వ చేసుకోవచ్చునని తెలిపారు. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం 5.5 టీఎంసీలకు చేరుతుందన్నారు. ఆదోని డివిజన్‌తో పాటు జిల్లాలో తాగు, సాగు నీటి సమస్య తీరుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 25 వేల ఎకరాల సాగుకు అదనంగా మరో 10 వేల ఎకరాల భూములకు నీరు అందించవచ్చునని తెలిపారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ఆధ్వర్యంలో జీడీపీను పర్యటక కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గోనెగండ్లలో తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి, భూ సర్వే పనులను పకడ్బందీగా చేయాలన్నారు. డీఈ విజయ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, ఏఈ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాంజల చెరువుకు పర్యాటక సొబగులు

ఆదోనిరూరల్: రాంజల చెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆదోని పట్టణంలోని రాంజల చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా), ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాంజల చెరువు ప్రాంతాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసి, పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండేలా పార్కులను తయారు చేసి మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీటి వసతి, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మంగళవారం డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 19న విజయవాడలో రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు వద్ద ధర్నా చేపట్టేందుకు బయలుదేరనున్న తమను ముందస్తు అరెస్టు చేయడం తగదన్నారు. జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

ఆదోని రూరల్: ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు కనీస వేతనం ఇవ్వాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు, డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ.. ఉన్నతస్థాయి చదువులు చదివిన విద్యార్థులు కేవలం నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఇచ్చే ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారన్నారు. నర్సులకు పనికితగ్గ వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి కనీస వేతనం అందేలా చూడాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడబూరు: నౌలేకల్లు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలోని సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓహెచ్ఎస్ఆర్ నిర్మించి పరిష్కారం చూపాలని కోరారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హౌసింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహిళా పోలీస్ కళ్యాణికి సమర్పించారు. సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు నాగిరెడ్డి, నరసింహులు, రాజేంద్ర, నారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్లుకుంటలో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల అధికారులు సంక్షేమ పథకాలకు సంబంధించిన నివేదికను తయారు చేసుకొని కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని సహకరించాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం




కందుకూరు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రాష్ట్రంలో చేపట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోసిగి మండలంలోని కందుకూరు గ్రామంలో ఎమ్మెల్యే సతీమణి వై.జయమ్మతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. గ్రామంలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థతో ప్రతిపక్ష నాయకుల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. వారు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన ప్రజలు జగనన్న వైపే ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబును అధికారంలోకి తేవాలన్న కాంక్ష తప్ప తన పార్టీ బాగోగులు పవన్‌కళ్యాణ్‌కు పట్టదన్నారు. అనంతరం స్థానిక సచివాలయంను తనిఖీ చేశారు. బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను వెంటనే రిలీవ్ చేయవద్దని, ఈ ప్రాంతానికి ఉద్యోగులు వచ్చాక రిలీవ్ చేయాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు సూచించారు.

బాధితురాలికి పరామర్శ

కందుకూరు గ్రామంలో గుండె ఆపరేషన్ చేయించుకుని, పక్షవాతంతో మంచం పట్టిన చంద్రమ్మ అనే మహిళను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె చికిత్స కోసం రూ.8 లక్షల వరకు ఖర్చయ్యిందని ప్రభుత్వం నుంచి సాయం అందించేలా చూడాలని బాధితకుటుంబ సభ్యులు కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెట్టనగౌడ్, భీంరెడ్డి, ఎంపీపీ ఈరన్న, జడ్పీటీసీ సభ్యురాలు పవిత్ర పాటిల్, సర్పంచ్ హనుమంతి, మహంతేష్ స్వామి, నాడుగేని నరసింహులు నాగరాజు, నరసింహులు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..



మృతుడు శ్రీనివాసులు(ఫైల్)

ఆదోనిఅర్బన్: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని శ్రీనివాసులు అనే ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు టూటౌన్ ఎస్ఐ చంద్ర తెలిపిన మేరకు... శ్రీనివాసులు మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అడగగా భార్య సుశీలమ్మ ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శ్రీనివాసులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

బైండోవర్ కేసు నమోదు

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లెలో ఆస్తి కోసం పన్నాగం పన్ని వృద్ధులైన తల్లిదండ్రులను బలవంతంగా తీసుకెళ్లి రిజిస్టర్ చేయించుకునే ప్రయత్నంలో సోమవారం పోలీసులకు దొరికిపోయిన చిన్న కుమారుడు, అతని వెంట వచ్చిన వారిని సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి అన్ని కోణాల్లో విచారించారు. జీపు డ్రైవర్ మినహా చిన్న కుమారుడైన కోడుమూరులో నివాసముంటున్న చిన్న తిప్పరాజు, అతని వెంట వచ్చిన కోడుమూరుకు చెందిన చిన్న సుంకన్న, హనుమంతు, రాముడు, హనుమన్నలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం స్థానిక తహసీల్దార్ రాజేశ్వరి ముందు హాజరుపరచగా పూచికత్తుపై వదిలేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వీరినుంచి వృద్ధ దంపతులకు ఎలాంటి సమస్య వచ్చినా తగు చర్యలు తీసుకుటామన్నారు.

అరుణాచలంకు బస్సు సర్వీసు

ఎమ్మిగనూరు టౌన్: పౌర్ణమి సందర్భంగా ఈనెల 31వ తేదీన అరుణాచలంకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ శనివారం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... చార్జీ రూ.2200 ఉంటుందని వెల్లడించారు.